# త్యాగానికి ప్రతీక బక్రీద్

- మౌలానా ఖాజీ ముస్తాక్ మదనీ
- భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు



పొదలకూరు : ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పొదలకూరు : ఈద్గా వద్ద దైవ సందేశం ఇస్తున్న ముస్తాక్ మాదనీ

**పొదలకూరు** : త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటామని జామ్యా మసీదుకు చెందిన మౌలానా ఖాజీ ముస్తాక్ మదనీ సందేశం ఇచ్చారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణానికి సమీపంలోని ఈద్గా వద్ద సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు మాట్లాడుతూ దైవ ఆదేశానుసారం బలిదానం చేసి త్యాగనిరతిని చాటుకున్నట్లు పేర్కొన్నారు. ఏ మత గ్రంథాలైనా పేదలను ఆదరించాల్సిందిగా సూచిస్తున్నట్లు తెలిపారు. దైవానుగ్రహానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎన్నుకున్నట్లు తెలియజేశారు. త్యాగానికి, సేవానిరతికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదినం రోజు ప్రతి ముస్లిం పేదలకు సాయం చేయాలన్నారు. సొంత మతాన్ని ఆదరించడంతో పాటు ఇతర మతాలను గౌరవించాలన్నారు. ఉన్న వారు లేనివారికి దాన ధర్మాలు చేస్తే దైవానుగ్రహం పొందినంత పుణ్యం వస్తుందన్నారు.

**ముత్తుకూరులో..**

**ముత్తుకూరు** : ముస్లింలు పవిత్రంగా భావించే బక్రీద్ పండగ ముత్తుకూరు మండలంలో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా ముత్తుకూరు ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలో అందంగా అలంకరించిన ఈద్గాలో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. స్థానిక మత పెద్ద ఇమామ్ తన ప్రసంగంలో అల్లాహ్ సందేశాలు, బోధనలు వినిపించారు. ఇదే విధంగా బ్రహ్మదేవి, ఈపూరు, మామిడిపూడి, పల్లెపాడుదిబ్బ, పొట్టెంపాడు, తాళ్లపూడి గ్రామాల్లో ప్రార్థనా మందిరాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**కొడవలూరులో..**

**కొడవలూరు** : బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే స్నానాలాచరించి కొత్త దుస్తులు ధరించి ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మత ప్రవక్తల బోధనలను ఆసక్తితో విన్నారు. దీంతో మండలంలోని కొడవలూరు, గండవరం, యల్లాయపాళెం, నార్తురాజుపాళెం తదితర గ్రామాల్లోని మసీదుల వద్ద సందడి నెలకొంది. ముస్లింలు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సాహాలతో పండగ జరుపుకున్నారు.

- **ఇందుకూరుపేట** : బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కొత్తూరు, ఇందుకూరుపేట, మైపాడు, కొరుటూరు, కుడితిపాళెం, గంగపట్నం, సోమరాజుపల్లి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

**వెంకటాచలంలో..**

**వెంకటాచలం**: బక్రీద్ పండగను మండల పరిధిలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వెంకటాచలం, సర్వేపల్లి, ఇస్లామ్‌పేట తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో పడమటి వాకిలి తెరిచారు. ప్రతి బక్రీద్ పండగ రోజు ఈ వాకిలి తెరిచి దర్గాలోకి భక్తులను అనుమతిస్తారు. దీని గుండా దర్గా లోపలికి వెళ్లి మస్తాన్ స్వామి సమాధిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో ఈ వాకిలి గుండా దర్గాలోకి వెళ్లేందుకు భక్తులు పోటీ పడ్డారు.

- **తోటపల్లిగూడూరు** : పవిత్ర బక్రీద్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ క్రమంలో మండలంలోని కోడూరు, సౌత్‌ఆములూరు, కొత్తపాళెం, వరిగొండ, నరుకూరు, వరిగొండ గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ముత్తుకూరులో ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొడవలూరు ఈద్గాలో ప్రార్థనల్లో ముస్లింలు



వెంకటాచలం మసీదులో ముస్లింల ప్రార్థనలు

## వేడుకగా పోతురాజుస్వామి జాతర

**ఇందుకూరుపేట** : మండలంలోని ముదివర్తిపాళెం గ్రామంలో పోతురాజుస్వామి జాతర సోమవారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

## ఆంధ్ర విద్యార్థి సంఘంలో మండల వాసులు



తురకా ప్రసాద్



వడదారి గోపీ

**పొదలకూరు** : ఆంధ్ర విద్యార్థి సంఘం(ఏవీఎస్)లో పొదలకూరు మండలానికి చెందిన వారికి కీలక పదవులు దక్కాయి. ఏవీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం తాడేపల్లిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు మండలం అంకుపల్లి గ్రామానికి చెందిన తురకా ప్రసాద్‌ను ఏవీఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రభగిరిపట్నం గ్రామానికి చెందిన వడదారి గోపీని రాష్ట్ర కోశాధికారిగా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఒక ప్రకటనలో ప్రసాద్, గోపీలు మాట్లాడుతూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ఆంధ్ర విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

## ఖాజాపీర్ దర్గాలో దువా

**నెల్లూరు(బృందావనం)**: బక్రీద్‌ను పురస్కరించుకొని చిన్నబజార్‌లోని షెహెన్ షా మసీదు ఖాజాపీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలను పీఠాధిపతి బాబా సాహెబ్ బందనవాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రపంచంలో శాంతి, సుఖం వెల్లివిరియాలని.. ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలని కాంక్షిస్తూ ప్రత్యేక దువా చేశారు.

## క్లుప్తంగా

### ఫాస్ట్‌ట్రాక్ వైద్యసేవలు ప్రారంభం

**నెల్లూరు(అర్బన్)**: అత్యవసర వైద్యాన్ని మరింత వేగవంతంగా అందించేందుకు గానూ నగరంలోని నారాయణ ఆస్పత్రిలో ఫాస్ట్‌ట్రాక్ ఎమర్జెన్సీ సేవలను సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ హరీష్, ఆపరేషన్స్ హెడ్ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగాధిపతి వేణుగోపాల్ మాట్లాడారు. రోగి వచ్చిన గంటలోపే అన్ని పరీక్షలు, వైద్యసేవలను అందించేందుకు వీలుగా దీన్ని ప్రారంభించామని వివరించారు. ఈ వైద్యసేవలను పొందేందుకు గానూ 90371 04108 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఆస్పత్రి ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలని వినతి

**నెల్లూరు (టౌన్)**: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు విజయవాడలో మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను సోమవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ నేత వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సమావేశం రేపు

**నెల్లూరు(బృందావనం)**: రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో బుధవారం నిర్వహించనున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరై వివిధ అంశాలపై చర్చించనున్నారని చెప్పారు. సమావేశానికి హాజరుకావాలని కోరారు.

### బాలలకు పౌష్టికాహార పంపిణీ

**నెల్లూరు(బృందావనం)**: జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న 200 మంది బాలలకు పౌష్టికాహారాన్ని కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్‌లో సోమవారం పంపిణీ చేశారు. జనసేన నేత కిశోర్, ట్రస్ట్ చైర్మన్ నిర్మల్‌కుమార్, విలియమ్స్, జయప్రకాష్, సిస్టర్ రమా, మరియమ్మ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ శాఖను పునర్వ్యవస్థీకరించరూ..

**నెల్లూరు(క్రైమ్)**: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను పునర్వ్యవస్థీకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రాలను సోమవారం సమర్పించారు. నేతలు శీనయ్య, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### అర్చకుల సమస్యలు పరిష్కరిస్తా



కమలానందభారతిని కలిసిన నేతలు

**నెల్లూరు(బృందావనం)**: దేవదాయ శాఖ పరిధిలోని వివిధ ఆలయాల్లో గల అర్చకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గన్నవరంలోని భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి పేర్కొన్నారు. నెల్లూరు విచ్చేసిన ఆయన్ను నగరంలోని బాబానగర్‌లో అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు, సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ తదితరులు సోమవారం కలిశారు. అర్చకుల జీతభత్యాలు, వేదపండితుల నియామకం, ఆలయాల నిర్వహణ తదితర అంశాలతో పాటు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కమలానందభారతి మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చించి అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అర్చక సమాఖ్య నేతలు శ్రీశైలం శ్రీధర్, అచ్యుత్, నారాయణ, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

### పెన్నా ఘాట్‌ను నిర్మిస్తాం

**నెల్లూరు(బృందావనం)**: రంగనాథుడి దేవస్థాన పడమటి రాజగోపుర పునర్నిర్మాణం, అద్దాల మండపాన్ని నయనానందకరంగా తీర్చిదిద్దడంతో పాటు అసంపూర్తిగా ఉన్న పెన్నా ఘాట్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపడతామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని తల్పగిరి రంగనాథుడ్ని ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వీరికి దేవదాయ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి బహూకరించిన వెండి కిరీటం

**పొదలకూరు** : మండలంలోని మరుపూరులో ఉన్న మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో అమ్మవారికి నెల్లూరు నగరానికి చెందిన బైపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మనుమరాలు బైపిరెడ్డి వినీలా సోమవారం వెండి కిరీటాన్ని బహూకరించారు. రూ.60 వేల విలువైన కిరీటాన్ని దేవస్థానం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజలు



ప్రసన్నాంజనేయునికి జరిపిస్తున్న మూలమంత్ర హోమం

**కొడవలూరు** : కొడవలూరులో వెలసిన ప్రసన్నాంజనేయస్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొడిముద్ద కార్యక్రమాన్ని సోమవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి సముద్రపు నీటితో స్నానం చేయించారు. అనంతరం గ్రామస్తులంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమత్ మూలమంత్ర హోమాలు అత్యంత వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం సముద్రపు నీటిని తీసుకొచ్చిన బాలదాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామివారికి పంజు సేవ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి హోమ పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోవూరు వెంకీ, పి.రాధాకృష్ణ, కాకాని మురళీ, మల్లెల అనిల్, గాలి ప్రసాద్, చంతాటి రవి, ఉయ్యాల నారాయణ, అరగల సుధీర్‌బాబు, ముడి హరికృష్ణ, దుంపల కిరణ్ పాల్గొన్నారు.

## తాగునీటి బోర్లకు మరమ్మతులు



బోరుకు మరమ్మతులు చేయిస్తున్న ఉప సర్పంచ్ తులసీరాం

**మనుబోలు** : మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో పనిచేయని తాగునీటి కుళాయిలకు సోమవారం మరమ్మతులు చేశారు. ఈ గ్రామంలో నీరు సరఫరా అయ్యే బోరు మరమ్మతులకు గురికావడంతో గత కొన్ని రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ సర్పంచ్ నాగమ్మ, ఉప సర్పంచ్ తులసీరాం దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలోనే పంచాయతీ పరిధిలోని కుడితిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు జట్లకొండూరులో పలుచోట్ల హ్యాండ్ బోర్లు వేయించారని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## క్రీడా స్ఫూర్తి ముఖ్యం



విజేతలతో ఎస్సై అజయ్‌కుమార్

**మనుబోలు** : ఆటల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తి ముఖ్యమైనదని ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను మనుబోలు మెయిన్ టీమ్, గ్రౌండ్ టీమ్‌లు సంయుక్తంగా గెలుచుకున్నాయి. ఈ రెండు జట్ల మధ్య సోమవారం సాయంత్రం జరగాల్సిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో నిర్వాహకులు రెండు జట్లను విజేతలుగా ప్రకటించారు. దీంతో విజేతలకు టీడీపీ నేత సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎస్సై అజయ్‌కుమార్ ట్రోఫీలను అందజేశారు. విజేత, రన్నరప్‌లకు కలిపి రూ.25 వేల నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దండు చంద్రశేఖర్‌రెడ్డి, చేరెడ్డి రామిరెడ్డి, కిరణ్, రమేష్‌రెడ్డి, జనసేన నేత ప్రసాద్, నిర్వాహకులు సాయి, దీపు తదితరులు పాల్గొన్నారు.

## రికేశ్ శర్మకు సత్కారం



**నెల్లూరు(బృందావనం)**: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా (జేసీఐ) అధ్యక్షుడు రికేష్ శర్మ జిల్లాలో సోమవారం పర్యటించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో జేసీఐ నెల్లూరు, నెల్లూరు ఏంజెల్స్, జేసీఐ నెల్లూరు క్లబ్ సభ్యులను కలిశారు. దేశవ్యాప్తంగా జేసీఐ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. సత్యనారాయణ, కృష్ణప్రసాద్, మనోజ్, విష్ణు, సాయి, శరణ్, శ్రీరామ్, అఖిలరెడ్డి, తవ్వా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

**మనుబోలు** : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. యారాశి సాయికృష్ణ, శ్రావణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## కసుమూరు దర్గాలో సోమిరెడ్డి ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న సోమిరెడ్డి

**వెంకటాచలం** : మండలంలోని కసుమూరులో ఉన్న మస్తాన్‌వలీ దర్గాను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కసుమూరు దర్గా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సోమిరెడ్డి తెలిపారు. టీడీపీ నేతలు కుంకాల నాగేంద్ర, గుమ్మడి రాజాయాదవ్, రాధాకృష్ణమనాయుడు, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, బీజేపీ నేతలు కుంచి శ్రీనివాసులుయాదవ్, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరుడి దర్శనభాగ్యం పూర్వజన్మసుకృతం



**నెల్లూరు(బృందావనం)**: సప్తగిరులపై కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుడి దర్శన భాగ్యం పూర్వజన్మసుకృతమని నెల్లూరులోని దత్తాత్రేయ మఠం నిర్వాహకులు మాతా అనంతానందగిరి తెలిపారు. తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్రను పురమందిరం వద్ద గల జ్యోతి వినాయకస్వామి ఆలయం నుంచి నెల్లూరు సత్యమార్గ్ ఫౌండేషన్ రవి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆమె మాట్లాడారు. శ్రీవారి భక్తుల కోసం దీవెన యాత్రను చేపట్టడాన్ని అభినందించారు. అనంతరం నిర్వాహకుడు రవి మాట్లాడారు. జిల్లాలోని పురిణి, అల్లూరు, తోటపల్లిగూడూరు, కందమూరు, వరిగొండ, గుండ్లపాళెం తదితర 18 గ్రామాల నుంచి 250 మంది భక్తులతో దీవెన యాత్రను ప్రారంభించామని వివరించారు. హైందవ ధర్మప్రచారం ద్వారా ఆర్థిక స్తోమత లేని నిరుపేద భక్తులను తిరుమలకు తీసుకెళ్లి శ్రీవారి దర్శనభాగ్యం కల్పించడం ద్వారా తమ జీవితం ధన్యమైందని చెప్పారు. తొలుత భక్తిగీతాలను ఆలపించారు. కొత్తూరు లలితా మహేశ్వరి ఆశ్రమ నిర్వాహకుడు రామాయణం మహేష్, ఫౌండేషన్ నిర్వాహకులు మల్లికార్జున, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ఏకాదశి పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి



ఆలయంలో అన్నదానం

**మనుబోలు** : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం(విష్ణాలయం)లో తొలి ఏకాదశి పూజలను సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ జరిపించి వేద మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలకు ఏలూరు శ్రీధర్‌రెడ్డి, నీరజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## చాముండేశ్వరీదేవికి పులివాహన సేవ



పులివాహనంపై ఊరేగుతున్న చాముండేశ్వరీదేవి అమ్మవారు



విశేషంగా తరలివచ్చిన ప్రజలు

**ఇందుకూరుపేట** : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం పులివాహన సేవ వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణతో మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారిని చూసి భక్తులు తన్మయం చెందారు. భక్తులు కొబ్బరికాయ కర్పూర హారతులు పట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మూలగల ప్రదీప్- మాధవి, పుల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి- మంజుల, సోమరాజుపల్లి కార్తీక్‌సాయి, అంకిత(యూఎస్ఏ) దంపతులు వ్యవహరించారు. ఉదయం జరిగిన చప్పర ఉత్సవానికి స్థానికులు కొండూరు సూరారెడ్డి, పద్మావతి దంపతులు ఉభయదాతలు కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి అశ్వ వాహనోత్సవం జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.